సాక్షి మంచిర్యాల

ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



స్పోర్ట్స్ కిట్లు అందజేత

మంచిర్యాలక్రైం: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు శనివారం స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సారంగపాణి, జాయింట్ సెక్రటరీ వెంకటేశ్వర్‌రెడ్డి, కే.సంపత్ రెడ్డి, ఈ.మారయ్య, సభ్యులు పాల్గొన్నారు.



అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా జట్టు

కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో శనివారం రాష్ట్ర స్థాయి జూనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లా జట్టు మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొంది.

గరిష్టం/కనిష్టం
31.0 /25.0

వాతావరణం

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. పొగమంచు కమ్ముకుని ఉంటుంది. ఆగ్నేయం దిశగా ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

అధికారుల వైఖరిపై ఆగ్రహం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి

మంచిర్యాలక్రైం: అధికారుల వైఖరిపై లక్సెట్టిపేట జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జెడ్పీ స్థాయీ కమిటీ సమావేశం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఏడు స్థాయీ కమిటీ సంఘాల సమావేశం నిర్వహించాల్సి ఉండగా ఒక్కటి మాత్రమే జరిగింది. వ్యవసాయం, అనుబంధ శాఖలపై సభ్యులు నిలదీశారు. చేపలు పంపిణీ చేయాల్సిన సమయంలో చేయకుండా కాంట్రాక్టర్ ఇష్టం వచ్చినప్పుడు చేస్తున్నాడని తెలిపారు. తలమల అటవీ ప్రాంతం నుంచి గఢ్‌పూర్‌కు వెళ్లనివ్వడం లేదని, వెళ్లేందుకు అవకాశం కల్పించాలని అన్నారు. వ్యవసాయ అధికారులు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో నరేందర్, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పత్తి సేకరణకు బయోమెట్రిక్

మంచిర్యాలఅగ్రికల్చర్: రానున్న పత్తి దిగుబడులను ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ బయోమెట్రిక్ ద్వారానే సేకరిస్తుందని జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారి గజానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సీజన్ నుంచి రైతుల బయోమెట్రిక్ ఐరిష్‌తోనే వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో తూకం వేస్తారని పేర్కొన్నారు. గతంలో ఆధార్‌కార్డు, పట్టాపాస్‌పుస్తకం, బ్యాంకు పుస్తకం అందజేస్తే కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ సీజన్ నుంచి బయోమెట్రిక్, ఐరిష్‌తోపాటు బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానం ఉంటేనే కొనుగోలు చేస్తుందని తెలిపారు. అక్రమాల అడ్డుకట్ట, దళారుల నియంత్రణకు ఈ పద్ధతి అమలులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. రైతులు బ్యాంకు ఖాతాను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని సూచించారు.

బీఆర్‌ఎస్ కౌన్సిలర్ రాజీనామా



రాజీనామా సమర్పిస్తున్న కౌన్సిలర్

రామకృష్ణాపూర్: క్యాతనపల్లిలో బీఆర్‌ఎస్ పార్టీకి షాక్ తగిలింది. ఆ పార్టీ 15వ వార్డు కౌన్సిలర్ బింగి శివాని తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణకు శనివారం తన రాజీనామా లేఖను అందజేశారు. 2019 ఎన్నికల్లో కౌన్సిలర్‌గా గెలిచినప్పటికీ తన వార్డు ప్రజలకు మౌలిక వసతులు కల్పించలేకపోయానని పేర్కొన్నారు. కౌన్సిల్ సమావేశాల్లో తీర్మానాలు చేయడమే గానీ సమస్యలు చెప్పుకునే పరిస్థితి తమకు రాలేదని తెలిపారు. ప్రజల సమస్యలు ఎమ్మెల్యేకు కూడా చెప్పుకునే స్వేచ్ఛ లేదని, ఎమ్మెల్యే నియంతృత్వ పోకడలను నిరసిస్తూ పదవికి, పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు పత్రికలకు ఓ ప్రకటన విడుదల చేశారు. కాగా, శివాని భర్త శివకిరణ్ ఇటీవల పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

ఎస్టీపీపీని సందర్శించిన కార్పొరేట్ జీఎం



దీక్షితులును సన్మానిస్తున్న సంజయ్‌కుమార్

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు(ఎస్టీపీపీ)ను కార్పొరేట్ జీఎం(సెక్యూరిటీ) దీక్షితులు శనివారం సందర్శించారు. సెక్యూరిటీ పోస్టులను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఏరియా స్టోర్స్ తనిఖీ చేసి సీసీ కెమెరాలు పరిశీలించారు. అనంతరం ఎస్టీపీపీ అడ్మిన్ భవన కార్యాలయంలో సీటీసీ సంజయ్‌కుమార్, జీ ఎం బసివిరెడ్డి, వోఅండ్‌ఎం చీఫ్ జెన్‌సింగ్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రామశాస్త్రి, ఎస్టోటు జీఎం సెక్యూరిటీ వేణుమాధవ్, సంక్షేమాధికారి ఠాకూర్ మోహన్‌సింగ్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

నేడు స్పౌజ్ టీచర్ల దరఖాస్తుల పరిశీలన

మంచిర్యాలఅర్బన్: స్పౌజ్ పాయింట్ దరఖాస్తుదారులు ఆప్షన్ ప్రింట్ కాపీని ఈ నెల ఒకటిన ఉదయం 10గంటలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందించాలని డీఈవో యాదయ్య సూచించారు. బదిలీ కోరుతూ ఆప్షన్ పొందుపర్చే క్రమంలో తమ తమ స్పౌజ్ సమీప పాఠశాలను ఎంచుకోవాల్సి ఉందని తెలిపారు. దూర క్రమంలో ఆప్షన్ ఇవ్వాల్సి ఉందని, ఉపాధ్యాయులు సమర్పించిన దరఖాస్తులను ఎంఈవోలు పరిశీలిస్తారని పేర్కొన్నారు.

మూడో అడుగు పడేనా..!



ప్లాంటు ఎదుట కొత్త ప్లాంటు నిర్మాణానికి చదును చేసిన ప్రాంతం

- 2015లో ఎస్టీపీపీ మూడో యూనిట్‌కు కేసీఆర్ శంకుస్థాపన
- ప్రభుత్వాల అనుమతి లభించినా సా..గదీత
- 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రానికి టెండర్లు
- 20శాతం అదనంగా కోట్ చేసిన బీహెచ్‌ఈఎల్
- టెండర్లు రద్దు చేసిన సింగరేణి

జైపూర్: జైపూర్ మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు(ఎస్టీపీపీ)ను విస్తరిస్తూ మూడో యూనిట్ ఏర్పాటుకు ముందడుగు పడడం లేదు. 2015 మార్చిలో ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేసినా ఇప్పటికీ మోక్షం లభించడం లేదు. ఇప్పటికే ఉన్న రెండు 600 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ల ముందు మరో 600 మెగావాట్ల ప్లాంటు నిర్మించాలని నిర్ణయించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం కాలుష్య నియంత్రణలో భాగంగా సూపర్ క్రిటికల్ విధానంతో 800 మెగావాట్ల ప్లాంటు ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అనుమతులు రావడంతో టెండర్ల దశకు చేరింది. కానీ మూడో యూనిట్ నిర్మాణంపై సింగరేణి సంస్థ పెద్దగా దృష్టి సారించడం లేదా.. లేక ప్రభుత్వం కొత్త యూనిట్ల నిర్మాణంపై ఆసక్తి చూపడం లేదా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 800మెగావాట్ల ప్లాంటుకు ఏడాది క్రితం టెండర్లు పిలువగా అంచనాకు మించి బీహెచ్‌ఈఎల్ సంస్థ 20 శాతం ఎక్కువ ధరకు కోట్ చేయగా.. రెండు సంస్థల మధ్య పలు దఫాలుగా ధరల తగ్గుదలకు చర్చించారు. అయినా బీహెచ్‌ఈఎల్ సంస్థ తగ్గకపోవడంతో సింగరేణి సంస్థ టెండర్లను రద్దు చేసింది. అన్ని రకాలుగా అడ్డంకులు తొలగినా ఏళ్లుగా మూడో యూనిట్ నిర్మాణ పనులు ప్రారంభానికి నోచుకోకపోవడంతో మోక్షం లభించేనా అనే సందేహం వ్యక్తమవుతోంది.

ఉపాధిపై యువత ఎదురుచూపులు

కొత్తగా ఏర్పాటు చేసే ప్లాంటుతో ఉద్యోగ అవకాశాలు మెండుగా లభిస్తాయని స్థానిక నిరుద్యోగ యువకులు, భూ నిర్వాసితులు ఆశగా ఎదురుచూస్తున్నారు. రెండేళ్లుగా కొత్త ప్లాంటు ప్రారంభమవుతుందని అధికార యంత్రాంగం చెబుతున్నా నిరాశే ఎదురవుతోంది. పరిసర ప్రాంతాల్లో నిరుద్యోగ సమస్య తీరుతుందని అందరూ భావిస్తున్నా నిర్మాణంలో తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది.

టెండర్ల దశలోనే..

సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు ద్వారా నిరంతరం విద్యుత్ ఉత్పత్తి చేస్తూ తెలంగాణ రాష్ట్రానికి వెలుగులు పంచుతోంది. సింగరేణి సంస్థకు ఇక్కడి వనరులు అనుకూలించడం, ప్రధానంగా అంచనాకు మించి సేకరించిన భూములతో థర్మల్ విద్యుత్ కేంద్రాలను విస్తరించే దిశగా ఆదిలో అడుగులు వేసింది. అందులో భాగంగానే నూతనంగా మరో 800 మెగావాట్ల ప్లాంటు రూ.6,800 కోట్ల అంచనాతో నిర్మించాలని నిర్ణయించింది. కానీ నిధుల సమీకరణలో జాప్యం చోటుచేసుకుంటోందో లేక ఆశించిన స్థాయిలో ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం లభించడం లేదో తెలియదు గానీ మూడో యూనిట్ పనులు టెండర్ల దశలోనే కొనసా..గుతున్నాయి. సింగరేణి సంస్థ అంచనా రూ.6,800 కోట్లు కాగా.. టెండర్లలో ఎల్–1గా నిలిచిన బీహెచ్‌ఈఎల్ కంపెనీ కరోనా తర్వాత స్టీల్ ధర పెరుగుదలతో అదనంగా 20శాతం పెంచగా.. ఎస్టీపీపీకి కన్సల్టెంట్‌గా ఉన్న ఎన్టీపీసీ సంస్థ సైతం ఎక్కువ చెల్లించడానికి అంగీకరించకపోవడంతో టెండర్లు రద్దు చేసింది.

నాణ్యత.. నవ్వుకునేలా..



హైటెక్‌సిటీ కాలనీలోని క్రీడాప్రాంగణంలో చేపడుతున్న నాణ్యత లేని పనులు

- ఇష్టారీతిన రూ.కోట్ల విలువైన పనులు
- పర్యవేక్షణ లేక కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం
- అయినా చర్యలు తీసుకోని అధికారులు



మైదా నంలో లెవలింగ్ కోసం నాసిరకం మట్టి(ఫైల్)

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల్లో నాణ్యత... నలుగురూ నవ్విపోయేలా ఉంది. కోట్ల రూపాయల విలువైన పనులను కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా చేపడుతున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన బల్దియా అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నాణ్యతాలోపం కళ్లకు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నా, నాసిరకం పనులపై ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా అధికారులు ఆ పనులను కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదు. నాలుగు కాలాల పాటు ఉండాల్సిన పనులు నాలుగేళ్లు కూడా ఉండే అవకాశం లేదని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రారంభించడంలోనూ జాప్యం..

టెండర్‌లో పనులు దక్కించుకుని వెంటనే ప్రారంభించాల్సి ఉన్నా కాంట్రాక్టర్లు కావాలనే జాప్యం చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు టెండర్ కేటాయింపు గురించి మర్చిపోయిన తర్వాత పనులు మొదలు పెడుతున్నారు. నెలల తరబడి ఆలస్యం చేసినా, అగ్రిమెంటు గడువులోపు పనులను పూర్తి చేయకపోయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంతో బల్దియాకు కోట్ల రూపాయల నష్టం జరుగుతోంది. ప్రజాధనం కాపాడాల్సిన అధికారులు ఎలాంటి చర్యలూ చేపట్టకపోవడ గమనార్హం.

నాణ్యతలో డొల్ల

రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతీ గ్రామం, మున్సిపాలిటీలోని ప్రతీ వార్డులో ఒక క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని గతేడాది నిర్ణయించింది. అందులో భాగంగానే మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని హైటెక్‌సిటీ కాలనీలోని పార్కును క్రీడా మైదానంగా మార్చారు. ఇందులో వివిధ ఆటలు ఆడుకునేందుకు, ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసేందుకు అనుకూలంగా వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు బల్దియా రూ.కోటి నిధులు కేటాయించింది. ఈ పనులు అప్పగించి ఏడాది గడిచినా ఇప్పటికీ కొనసాగుతున్నాయి. వాకింగ్ ట్రాక్‌తోపాటు, ఒక గది, మూత్రశాలలు, రెండు గేట్ల ఏర్పాటు, ఖాళీ స్థలంలో నాణ్యమైన మట్టిని నింపి, క్రికెట్ వంటి క్రీడలను ఆడుకునేందుకు అనువుగా ఏర్పాటు చేయాలి.

నాసిరకం మెటీరియల్..

నిర్మాణ పనుల్లో నాసిరకం మెటీరియల్ వాడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వాకింగ్ ట్రాక్ నిర్మాణ సమయంలోనే సైడ్‌వాల్‌కు క్రాక్ వచ్చింది. క్రికెట్ మైదానం కోసం నాణ్యమైన మట్టిని పోయాల్సి ఉన్నా.. డిస్‌మెటల్, భవనాలు కూల్చిన వ్యర్థాలు, పనికిరాని రాళ్లు, చెత్తతో నిండిన మట్టిని మైదానంలో నింపారు. స్థానికులు అభ్యంతరం చెప్పడంతో కాంట్రాక్టర్ అందులోని కొంత మట్టిని తొలగించి, మిగతాది అక్కడే లెవలింగ్ చేసి చేతులు దులుపేసుకున్నాడు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నాసిరకం మట్టి బయట పడుతోంది.

పనులు పరిశీలించి చర్యలు..

అభివృద్ధి పనుల్లో నాణ్యత లేకుండా చేపడితే సదరు కాంట్రాక్టరుతో తిరిగి పనులు చేయిస్తున్నాం. బిల్లులు మంజూరు చేయడం లేదు. క్రీడా ప్రాంగణంలో చెత్తతో కూడిన మట్టిని నింపినప్పుడు వచ్చిన ఫిర్యాదుతో ఆ మట్టిని తొలగించాలని కాంట్రాక్టర్‌కు చెప్పాం. చెత్తతో కూడిన మట్టిని తొలగించారు. కొంత మిగిలిపోవడం వల్ల రాళ్లు బయటకు వస్తున్నట్లు తెలుస్తోంది. నాణ్యమైన మట్టిని వేసేలా చర్యలు తీసుకుంటాం.

– మధుకర్, మున్సిపల్ ఇంజినీర్

మొక్కలకు నాసిరకం మట్టి..

పట్టణంలోని నాలుగు జంక్షన్లను రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతుండగా, సర్కిళ్లలో గ్రీనరీ ఏర్పాటుతోపాటు, మొక్కలు నాటేందుకు నాణ్యమైన మట్టిని నింపాల్సి ఉంది. కానీ సదరు కాంట్రాక్టర్ చెత్తా చెదారం, ప్లాస్టిక్ కవర్లు, రాళ్లతో కూడిన మట్టిని నింపి పనులను చేస్తున్నారు. అయినా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్, పక్కన ఎంపీ వెంకటేష్ నేత, ఎమ్మెల్యే దివాకర్‌రావు

- నేడు కేటీఆర్ పర్యటన
- రూ.312కోట్లతో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు
- ప్రభుత్వ విప్ బాల్క సుమన్

మంచిర్యాలక్రైం: రాష్ట్ర అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమైందని చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. ఆదివారం మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ చెన్నూర్ నియోజకవర్గంలో పర్యటించనున్న సందర్భంగా శనివారం మంచిర్యాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటీఆర్ పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేస్తారని అన్నారు. మందమర్రి, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీల్లో రూ.312.96కోట్లతో పనులు ప్రారంభిస్తారని తెలిపారు. జూన్ 9న కేసీఆర్ పర్యటనలో ఆయిల్ ఫాం ప్యాక్టరీకి శిలాఫలకం ప్రారంభించారని, మందమర్రి శివారులో రూ.500 కోట్లతో ఫ్యాక్టరీ నిర్మాణానికి కేటీఆర్ భూమి పూజ చేస్తారని చెప్పారు. మందమర్రిలో రూ.41కోట్లతో అర్బన్ భగీరథ ప్రాజెక్టు, సెంట్రల్ లైటింగ్ పనులు, 560 డబుల్‌బెడ్రూం ఇళ్లు ప్రారంభిస్తారని, సింగరేణి పట్టాల పంపిణీ, పాలవాగు వంతెన నిర్మాణానికి రూ.20కోట్లతో, రూ.11 కోట్లతో బ్రిడ్జిలు, చెక్‌డ్యాంల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారని అన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీలో రూ.108.16కోట్లతో పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేస్తారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత మంచిర్యాల జిల్లా, మెడికల్ కాలేజీ, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, మాతాశిశు కేంద్రం, పట్టణ సుందరీకరణ, గాంధారి వనంలో కేటీఆర్ అర్బన్ పార్కు ఇలా జిల్లా అభివృద్ధికి చిరునామాగా మారిందన్నారు. మరోసారి బీఆర్‌ఎస్‌కే అధికారం కల్పిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. మందమర్రిలో మార్కెట్ ఏరియా మీదుగా రోడ్‌షో, రామకృష్ణాపూర్ ఠాగూర్ స్టేడియంలో బహిరంగసభ విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేష్‌నేత, స్థానిక ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

కేటీఆర్ పర్యటనకు సర్వం సిద్ధం



బందోబస్తుపై సీపీతో చర్చిస్తున్న విప్ సుమన్



బహిరంగ సభ వేదిక

- కేసీఆర్ అర్బన్‌పార్కు పనులకు శంకుస్థాపన
- ఠాగూర్ స్టేడియంలో బహిరంగ సభ

రామకృష్ణాపూర్: రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కే.తారక రామారావు పర్యటనకు సర్వం సిద్ధమైంది. పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొనడానికి ఆదివారం వస్తుండడంతో అధికార యంత్రాంగం పనుల్లో నిమగ్నమైంది. అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం స్థానిక ఠాగూర్‌స్టేడియంలో నిర్వహించనున్న బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. ఇటీవల సీఎం కేసీఆర్ ప్రకటించిన రూ.25 కోట్లతోపాటు డీఎంఎఫ్‌టీ, టూరిజం శాఖ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు కేటీఆర్ శంకుస్థాపన చేస్తారు. పట్టణంలో అంతర్గత రోడ్ల నిర్మాణం, ఒకే దఫా సుమారు రూ.80 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులు చేపడుతారు. అనంతరం రామకృష్ణాపూర్ నుంచి మంచిర్యాల వెళ్లే దారిలో ఉన్న క్యాతనపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులను మంత్రి పరిశీలిస్తారు. గాంధారి వనంలో కేసీఆర్ అర్బన్‌పార్కు ఏర్పాటుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. 250 ఎకరాల్లో రూ.50 కోట్లతో తీర్చిదిద్దనున్నారు. హైదరాబాద్ శిల్పారామం తరహాలో బొక్కలగుట్ట వద్ద గల గాంధారి వనాన్ని అభివృద్ధి చేయాలని విప్ సుమన్ సంకల్పించిన నేపథ్యంలో ఈ పార్కు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. మొత్తానికి అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మంత్రి రామకృష్ణాపూర్, మందమర్రి పర్యటనకు విచ్చేస్తుండడంతో బీఆర్‌ఎస్ వర్గాల్లో నూతన ఉత్తేజం నింపుతుందనే చర్చ సాగుతోంది.

డబుల్ బెడ్రూం ఇళ్ల ప్రారంభం

స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలో రూ.15.16 కోట్లతో నిర్మించిన 286 ఇళ్లను మంత్రి ప్రారంభిస్తారు. సింగరేణి స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న 1282మందికి పట్టాలు పంపిణీ చేస్తారు. మంత్రి పర్యటనకు రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి, డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్, బెల్లంపల్లి ఏసీపీ సదయ్య ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

మందమర్రిలో..

మందమర్రిరూరల్: అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్ ఆదివారం మందమర్రికి రానున్నారు. ఉదయం 10గంటలకు మందమర్రి మండలం శంకర్‌పల్లి గ్రామంలో ఫామాయిల్ ఫ్యాక్టరీకి భూమి పూజ, షీర్కేలోని కేసీఆర్ మల్టీపర్పస్ హాల్, సమ్మక్క–సారలమ్మ మహిళా భవన్, బతుకమ్మ గ్రౌండ్, డబుల్‌బెడ్ రూం ఇళ్లు, సెంట్రల్‌లైటింగ్ సిస్టం, అర్బన్‌మిషన్ భగీరథ, తదితర పనులు ప్రారంభిస్తారు.

మంచిర్యాలలో రూ.కోటితో ప్రెస్‌క్లబ్

- జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు
- ప్రభుత్వ విప్ బాల్క సుమన్

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా కేంద్రం మంచిర్యాలలో రూ.కోటితో ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేస్తామని, జర్నలిస్టుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో శనివారం కలెక్టర్ సంతోష్, ఎంపీ వెంకటేష్‌నేత, మంచిర్యాల, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్యలతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, జిల్లా కేంద్రంతోపాటు మండలాల్లో ప్రభుత్వ స్థలాలను గుర్తించి తహసీల్దార్లకు సూచించాలని అన్నారు. అర్హులకు ఇళ్ల స్థలాల పంపిణీకి ప్రభుత్వ ఆమోదం మేరకు ముందుకు వెళ్తున్నామని తెలిపారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ ఎలాంటి వివాదాలు లేని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో జర్నలిస్టుల యూనియన్ నాయకులు, వివిధ మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

జిల్లాలో 10.7 మిల్లీమీటర్ల వర్షపాతం

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో శుక్రవారం నుంచి శనివారం వరకు 10.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. హాజీపూర్ మండలంలో 40.7 మిల్లీమీటర్లు, దండేపల్లిలో 34.3, మందమర్రిలో 29.2, లక్సెట్టిపేటలో 21.7, జన్నారంలో 17.7, మంచిర్యాలలో 16.2, తాండూర్‌లో 12.7, నస్పూర్‌లో 6, కోటపల్లిలో 4.3, జైపూర్‌లో 3.6, వేమనపల్లిలో 2.9, కాసిపేట మండలంలో 1.3మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా సాధారణ వర్షపాతం 938.4 మిల్లీమీటర్లు కాగా 1031.3 మిల్లీమీటర్లు కురిసింది. 10 శాతం అధికంగా నమోదైంది.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

దండేపల్లి: విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. మండలంలోని వెల్గనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి యాదయ్యతో కలిసి శనివారం సందర్శించారు. 9, 10వ తరగతుల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ కార్యక్రమాల్లో పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. విద్యార్థులు ప్రణాళికలు ఎలా రూపొందించుకోవాలి, ఎవరెవరి సాయం తీసుకోవాలి అనే అంశాలను వివరించారు. ప్రతీనెల 4వ శనివారం జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో మండల స్థాయి అధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి చౌదరి, ఎంపీడీవో మల్లేశం, ఎస్సై ప్రసాద్, ఏవో అంజిత్‌కుమార్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు సతీష్ పాల్గొన్నారు.

క్రీడలతో భవిష్యత్

లక్సెట్టిపేట: విద్యార్థులకు క్రీడలతో మంచి భవిష్యత్ ఉంటుందని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల కళాశాలలో డివిజన్ స్థాయి గిరిజన క్రీడా పోటీలను ప్రారంభించారు. గిరిజనాభివృద్ధి అధికారి నీలిమా, కళాశాల ప్రిన్సిపాల్ గౌతంరెడ్డి, పీడీ జీవరత్నం, అధికారులు రాజమౌళి, చిరంజీవి, గఫూర్, శంకర్ పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలి



మాట్లాడుతున్న మంచిర్యాల ఆర్డీవో రాములు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఎన్నికల నిర్వహణలో అధికారులకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని మంచిర్యాల ఆర్డీవో రాములు తెలిపారు. శనివారం మంచిర్యాల ఆర్డీవో కార్యాలయంలో మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోని సెక్టోరల్ అధికారులు, తహసీల్దార్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్డీవో మాట్లాడుతూ ఎన్నికల సంఘం నియమ, నిబంధనలకు లోబడి అధికారులకు విధులు కేటాయిస్తామని తెలిపారు. పోలింగ్ కేంద్రాలను సందర్శించి సౌకర్యాలు, ఇతర భద్రతా చర్యలు పరిశీలించి నివేదికలను అక్టోబర్ 3లోపు అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, సెక్టోరల్ అధికారులు, జోత్స్న, ఎన్నికల అధికారి సనత్, శ్రీహరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

లారీని ఢీకొట్టిన కోళ్ల వ్యాన్


లారీని ఢీ కొట్టిన వ్యాన్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట శివయ్య కాలనీ సమీపంలో శనివారం ఆగి ఉన్న లారీని కోళ్ల వ్యాన్ ఢీ కొట్టింది. అయితే డీజిల్ అయిపోవడంతో లారీని నిలిపివేయగా వెనక నుంచి కోళ్ల వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ఎలుగుబంటిదాడిలో వ్యక్తికి తీవ్రగాయాలు


తీవ్ర గాయాలపాలైన పశువుల కాపరి

సిర్పూర్(టి): మండలంలోని భూపాలపట్నం గ్రామ శివారులో శనివారం గేదెలను మేత కోసం తీసుకెళ్లిన పశువుల కాపరి కత్తరసాల మొగిలిపై ఎలుగు బంటి దాడి చేసింది. దీంతో తీవ్ర గాయాలు కావడంతో చుట్టుపక్కల పంట చేనుల్లోని రైతులు గమనించి గ్రామానికి తీసుకువచ్చి ప్రథమ చికిత్స చేయించి అనంతరం సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట గ్రామానికి చెందిన దుర్గం రాజ్‌కుమార్(35) శనివారం బలవన్మరణానికి పాల్పడాడు. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం మేరకు.. గుడిపేటలో నివాసం ఉంటున్న దుర్గం రాజ్‌కుమార్ కొన్నేళ్లుగా చెడు వ్యసనాల బారినపడగా ఏడాది క్రితం తీవ్ర అనారోగ్యానికి గురై ఏడాదిగా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నాడు. ఆరోగ్యం కుదుటపడకపోవడంతో జీవితంపై విరక్తితో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి సోదరుడు మారుతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలపారు.

రక్తదాతలు.. ప్రాణప్రదాతలు



రక్తదానం చేస్తున్న బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

రక్తదానం చేసిన బీఎస్ఎన్ఎల్ సిబ్బంది..

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రక్తనిధి కేంద్రంలో శనివారం బీఎస్ఎన్ఎల్ సిబ్బంది రక్తదాన చేశారు. అక్టోబర్ 01 బిఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని 20మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బిఎస్ఎన్ఎల్ డివిజనల్ ఇంజనీర్ సోమయ్య మాట్లాడారు. సికిల్‌సెల్, తలసేమియా వ్యాధి గ్రస్తుల సహాయార్థం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. యువత రక్తదానంపై అపోహలు వీడి రక్తదానికి ముందుకు రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ భాస్కర్‌రెడ్డి, రక్తనిధి ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, రక్తదాతలు శ్రీధర్, రవికుమార్, మధుకర్, సదాశివ, బండ దిలీప్‌కుమార్, శ్రీనివాస్, తిరుపతి, మహేందర్, రాజేశం, కుమారస్వామి, రహీం బ్లడ్ డొనేషన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు అబ్దుల్ రహీం పాల్గొన్నారు.

అత్యవసర సమయాల్లో రక్తం అందక పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. దీంతో ప్రభుత్వాలు, పలు స్వచ్ఛంద సంస్థలు రక్తదానంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అయినా పలు సమయాల్లో రక్తం అందక పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. కొన్ని సమయాల్లో బ్లడ్ బ్యాంక్‌ల్లో రక్తనిల్వలు అందుబాటులో లేక దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తీవ్ర ఇబ్బంది పడాల్సిన దుస్థితి. ఈ నేపథ్యంలో ఇండియన్ సొసైటీ ఆఫ్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ అండ్ ఇమ్యూనో హెమటాలజీ ద్వారా 1975 అక్టోబర్ 01న జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం నిర్వహిస్తోంది. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో పలువురు రక్తదానం చేస్తూ ప్రాణప్రదాతలుగా మారుతున్న వారి అభిప్రాయాలతో కథనం...

- అత్యవసర సమయాల్లో అందని రక్తం
- పలువురు రక్తదాన శిబిరాలు ఏర్పాటుతో ముందుకు
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థలు
- నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం

రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో...

పాతమంచిర్యాల: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆవరణలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ద్వారా దాతల నుంచి స్వచ్ఛందంగా రక్తాన్ని సేకరించి తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లోని గర్భిణులకు, అత్యవసర పరిస్థితుల్లోని వారికి రక్తాన్ని అందిస్తున్నారు.

రోగులు కోలుకుంటే సంతృప్తి



పాతమంచిర్యాల: నేను 21 సార్లు రక్తదానం చేశాను. 10సార్లు ఉచితంగా ప్లేట్‌లెట్స్ దానం చేసి డెంగీ వ్యాధిగ్రస్తులను కాపాడాను. వృత్తిరీత్యా వ్యాపారం చేసుకుంటాను. రక్తం కావాలని ఫోన్ చేస్తే వెంటనే స్పందించి జిల్లా కేంద్రంలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు సైతం వెళ్లి రక్తదానం చేశాను. తాను రక్తదానం చేసిన తర్వాత రోగులు కోలుకుని తనకు ఫోన్‌లు చేసి అభినందిస్తారు. దీంతో నాకు ఎంతో సంతృప్తి కలుగుతుంది.

– గుమాస ప్రమోద్, కాసిపేట

ఎనిమిదేళ్లుగా సేవలో



పాతమంచిర్యాల: ఎనిమిదేళ్ల క్రితం కొద్దిమంది మిత్రులతో కలిసి రహీం బ్లడ్ డొనేషన్ వెల్ఫేర్ సొసైటీ ప్రారంభించాను. రక్తం అవసరం ఉన్న వారికి సికిల్‌సెల్, తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తనిధి కేంద్రంలో రక్తదాన శిబిరాల ద్వారా రక్తం సేకరిస్తున్నాం. ఏ ఆస్పత్రిలో రోగికి అవసరం ఉందని సమాచారం వచ్చినా వెంటనే స్పందించి రక్తం అందించి రోగుల ప్రాణాలు కాపాడడానికి తమ వంతు సహకారం అందిస్తున్నాం. ఇప్పటి వరకు 1800 మందికి స్వచ్ఛందంగా రక్తం అందించాం.

– అబ్దుల్ రహీం. రహీం బ్లడ్ డొనేషన్ వెల్ఫేర్ సొసైటీ, మంచిర్యాల

సంతృప్తి.. సంతోషం



ఆసిఫాబాద్: ఇప్పటి వరకు 33 సార్లు రక్తదానం చేశాను. ప్రతీ మూడు మాసాలకోసారి రక్తదానం చేస్తాను. ముఖ్యంగా తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఇస్తుంటాను. మోవాడ్‌లో ఒక తలసేమియా పేషెంట్ కోసం వెంకటాపూర్ సర్పంచ్ ఫోన్ చేస్తాడు. దీంతో వెంటనే రక్తం ఇవ్వడం జరుగుతుంది. ఎవరికి ఆపద ఉన్న రక్తదానం చేస్తాను. రక్తదానంతో ప్రాణదానం చేసిన సంతృప్తితో పాటు సంతోషం లభిస్తుంది.

– వైరాగోరే ప్రతాప్, ఆసిఫాబాద్

46సార్లు రక్తదానం...


రక్తదానం చేస్తున్న మధుసూదన్(ఫైల్)

లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ కో–ఆర్డినేటర్ ఫర్‌బ్లడ్ డొనేషన్ క్యాంప్, ఇండియన్ రెండ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి మధుసూదన్ ఇప్పటి వరకు 46సార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రజల మన్ననలు పొందాడు. అరుదైన ఏబీ నెగెటివ్ గ్రూపు కలిగిన అతడు అత్యవసర పరిస్థితుల్లో బాధితులకు రక్తాన్ని అందించి పలువురిని ప్రాణాపాయం నుంచి కాపాడారు. ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర గవర్నర్, కలెక్టర్‌లు ప్రశంసాపత్రాలు ఇచ్చి సన్మానించారు.

రోగులకు ఆసరాగా..



పాతమంచిర్యాల: ఇప్పటి వరకు 20 సార్లు రక్తదానం చేశాను. రహీం బ్లడ్‌డొనేషన్ వెల్ఫేర్ సొసైటీలో సభ్యులుగా ఉన్న తనకు ఎక్కడి నుంచి ఫోన్ వచ్చిన రాత్రిపగలు తేడా లేకుండా అత్యవసర సమయాల్లో రక్తదానం చేసి రోగులకు ఆసరాగా నిలుస్తున్నాను.

– మహ్మద్ ముజాహిద్, మంచిర్యాల

రక్తదాతలను ప్రోత్సహిస్తా



ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలోని బ్లడ్ బ్యాంకులో రక్తం నిల్వ లేనప్పుడు నన్ను సంప్రదిస్తారు. అలాంటి సందర్భంలో వెంటనే రక్తదాతలను తీసుకొచ్చి రక్తదానం చేయిస్తాను. నేను కూడా ఆరు సార్లు రక్తదానం చేశాను. ఇప్పటి వరకు బ్లడ్ బ్యాంకులో సుమారు వెయ్యి యూనిట్లు రక్తం ఇప్పించాను. అవసరమున్న వారు సెల్ నెం.9573854347 సంప్రదించవచ్చు.

– మాడిశెట్టి ప్రశాంత్, సామాజిక కార్యకర్త

అపోహలు వీడి..



నిర్మల్ చైన్‌గేట్: రక్తదానం ప్రాణదానం వంటిది. ప్రతీఒక్కరు రక్తదానం చేయవచ్చు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చు. నేను ఇప్పటి వరకు 56సార్లు రక్తం ఇచ్చాను. అపోహలు వీడి రక్తదానానికి ముందుకు రావాలి.

– వేణుగోపాలకృష్ణ, జిల్లా ఆస్పత్రి వైద్యుడు

సంతృప్తినిస్తుంది



ఆదిలాబాద్: అత్యవసర పరిస్థితిలో రక్తదానం చేయడంతో ఇతరుల ప్రాణాలను నిలబెట్టిన వారమవుతాం. ఇటువంటి సందర్భాల్లో ప్రతీఒక్కరు ముందుకు రావాలి. ఇప్పటివరకు నేను 32సార్లు రక్తదానం చేశాను. ఒక రాష్ట్రస్థాయి అవార్డు సైతం వచ్చింది. ఈ అవార్డులు రివార్డుల కన్నా రక్తదానం చేయడమే సంతృప్తినిస్తుంది.

– అబ్దుల్ అజీజ్, బెస్ట్ ఫ్రెండ్స్ హెల్ప్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు

ముందుకు రావాలి



ఆదిలాబాద్: జిల్లాలో ఎంతోమంది రక్తహీనతతో బాధపడుతున్నారు. అటువంటివారు సరైన సమయంలో రక్తం దొరకక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటివరకు 60 సార్లు రక్తదానం చేశాను. గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం రోజున పురస్కారం సైతం తీసుకున్నాను.

– ఉత్తర్‌వార్ గణేష్, ఆదిలాబాద్

ఎవరికి అవసరం ఉన్నా..



కౌటాల: రక్తదానం చేయడంతో ఆరోగ్యంగా ఉంటాం. ఇప్పటి వరకు నేను పది సార్లు రక్తదానం చేశాను. అత్యవసరంలో ఉన్న వారికి రక్తదానం చేసినప్పుడు చాలా ఆనందంగా ఉంటుంది. నా బ్లెడ్ గ్రూప్ ఎ పాజిటివ్. ఎవరికి అవసరం ఉన్న రక్తదానం చేయడంలో నేను ముందుంటాను.

– బాలజీ, గుడ్లబోరి, కౌటాల

ప్రాణాలు దక్కుతాయి



కౌటాల: రక్తదానం చేస్తేనే రక్తం అవసరం ఉన్నవారి ప్రాణాలు దక్కుతాయి. నేను ఇప్పటి వరకు ఐదు సార్లు రక్తదానం చేశాను. ఆసుపత్రిలో చాలా మంది నిరుపేద రోగులు రక్తం కోసం ఇబ్బందులు పడుతున్నారని సోషల్ మీడియాలో వస్తే వెళ్లి రక్తదానం చేసి వస్తాను. నావంతుగా అవసరం ఉన్నవారికి రక్తదానం చేస్తున్నాను.

– మోర్లె పాండురంగ్, కన్నెపల్లి, కౌటాల

యోగా పోటీల్లో ‘బెల్లంపల్లి’కి పతకాలు


పతకాలతో బెల్లంపల్లి యోగా విజేతలు

బెల్లంపల్లి: జాతీయ స్థాయి యోగా పోటీల్లో బెల్లంపల్లికి బంగారు పతకాలు వరించాయి. గోవా యూత్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు జరిగిన ఆల్ ఇండియా జాతీయ స్థాయి యోగా పోటీల్లో బెల్లంపల్లికి చెందిన యోగా క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనబర్చారు. బెల్లంపల్లిలోని వశిష్ట యోగా శిక్షణ సెంటర్ టీచర్ రమణ ఆధ్వర్యంలో 12మంది పోటీల్లో పాల్గొనగా నాలుగు బంగారు పతకాలు, ఒక వెండి పతకం సాధించారు. 8–15 సంవత్సరాల విభాగంలో దాసరి కుషి, 16 సంవత్సరాల విభాగంలో గుర్రం మానస, 25–30 సంవత్సరాల విభాగంలో కర్ణకొండ శిరీష, 30–40 సంవత్సరాల విభాగంలో ఏనుగు హేమలత బంగారు పతకాలు సాధించగా, 30–40 సంవత్సరాల విభాగంలో పులి అశోకకుమారి వెండి పతకం సాధించింది. ఈ పోటీలకు రమణ జడ్జిగా వ్యవహరించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆల్ ఇండియా యూత్ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ విద్య కిరణ్ పతకాలు, బహుమతులు అందజేశారు. బెల్లంపల్లి నుంచి పతకాలు సాధించడంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఐటీఐలో ఐదో విడత అడ్మిషన్లకు అవకాశం

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో నాలుగు దఫాలో మిగిలిన సీట్ల భర్తీకి ఐదో విడత దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందని మంచిర్యాల ఐటీఐ ప్రిన్సిపాల్ చందర్ తెలిపారు. ఐదో విడత ఐటీఐ అడ్మిషన్ల రిజిస్ట్రేషన్లకు అక్టోబర్ 1 తుది గడువుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఐటీఐలో ప్రవేశాలు పొందే విద్యార్థుల ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలో అక్టోబర్ 9లోగా నిర్ణీత సమయంలో ఐటీఐ రిజిస్ట్రేషన్ల ఫారం, సంబంధిత ధృవపత్రాలతో హాజరుకావాలన్నారు. ఐదో దఫా అడ్మిషన్ల కోసం ఇంతకుముందు ఆఫ్‌లైన్ చేసుకోని అభ్యర్థులు కొత్తగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, ఇప్పటికే నమోదు చేసుకున్న వారు మళ్లీ నమోదు అవసరం లేదన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి


వినతిపత్రం అందిస్తున్న టీఏజీఎస్ నాయకులు

వేమనపల్లి: జిల్లాలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు భాగాల రాజన్న, కార్యదర్శి ఎర్మ పున్నం అన్నారు. శనివారం వేమనపల్లి మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సందర్శించి అక్కడి వసతులపై ఆరా తీశారు. పీహెచ్‌సీలో రోగులకు సరిపడా వైద్యసిబ్బంది లేరని ఏడాది కాలంగా పీహెచ్‌సీలో ప్రసవాలే జరగడం లేదన్నారు. వైద్య సిబ్బంది పూర్తిస్థాయిలో లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనంతరం డీటీ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట టీఏజీఎస్ నాయకులు ఉన్నారు.

కస్టోడియల్ డెత్‌పై న్యాయ విచారణ

మంచిర్యాలక్రైం: బెల్లంపెల్లి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆగస్టు 28న లాకప్ డెత్ జరిగిందనే ఆరోపణలపై శనివారం స్థానిక ఆర్డీవో కార్యాయలంలో ఆర్డీవో రాములు న్యాయ విచారణ చేశారు. బెల్లంపల్లి పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్రాంతానికి చెందిన కీర్తి అంజి(27)ని పోలీసులు కొట్టి చంపారంటూ కుటుంబ సభ్యులు ఆరోపించారు. దీనిపై ఆర్డీవో గంటపాటు విచారణ జరిపినట్లు సమాచారం. ఈ విచారణలో ఒక సీఐ, ఇద్దరు ఎస్సైలు, మరో ఇద్దరు హాజరైనట్లు తెలిసింది. ఈ విషయన్ని అధికారులు గోప్యంగా ఉంచడం గమనార్హం.

ఎన్ఎంఎంఎస్‌కు దరఖాస్తు చేసుకోవాలి

దండేపల్లి: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్(ఎన్ఎంఎంఎస్) పరీక్షకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి విద్యార్థులు ఈ నెల 13లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల హార్డ్ కాపీలను పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా ఈ నెల 16లోగా డీఈవో కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు.

ఓసీపీలో కాంట్రాక్ట్ కార్మికుడి ఆత్మహత్య


వీరస్వామి(ఫైల్)


కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రావు

శ్రీరాంపూర్: విధులకు వద్దన్నారని మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఓపెన్ కాస్టు గనిలో కాంట్రాక్టు కార్మికుడు దొంతగాని వీరస్వామి(50) ఓబీ క్యాంపు సైటు వద్ద శుక్రవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ఉదయం ఆయన మృతదేహం చెట్టుకు వేలాడుతూ కనిపించింది. శ్రీరాంపూర్ పోలీసులు, కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లాకు చెందిన వీరస్వామికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఇక్కడికి సమీపంలోని రామారావుపేటలో కొంతకాలంగా నివాసం ఉంటున్నాడు. శ్రీరాంపూర్ ఓసీపీ ఓబీ పనులు నిర్వహించే సీఆర్ఆర్ కంపెనీలో జనవరి నుంచి కాంట్రాక్టు కార్మికుడిగా చేస్తున్నాడు. సెప్టెంబర్ 27న కాంట్రాక్టు సంస్థ మేనేజర్ ఉద్యోగంలోకి తీసుకోవడం లేదు. ఏదో వస్తువులు దొంగతనంగా తీసుకెళ్లిన అభియోగంతో ఈ చర్యకు పాల్పడ్డట్లు తోటి కార్మికులు తెలిపారు. దీంతో మనస్తాపం చెంది ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

నష్టపరిహారం చెల్లించాలని ఆందోళన

మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించకుండా ఓబీ కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళన చేశారు. పనిలోకి తీసుకోకపోవడం వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించారు. శ్రీరాంపూర్ ఓసీపీ పీఓ పురుషోత్తం రెడ్డి, మేనేజర్ సుధీర్ ఆందోళనకారులు, ఓబీ కాంట్రాక్టర్‌తో చర్చలు జరిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు, ఐఎన్టీయూసీ నాయకులు శంకర్‌రావు, కలవేని శ్యాం, ఏఐటీయూసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ సెక్రెటరీ అఫ్రోజ్‌ఖాన్ ఆందోళన తీవ్రతరం చేశారు. దీంతో కాంట్రాక్ట్ సంస్థ రూ.8.20లక్షలు నష్ట పరిహారంగా ఇస్తానని చెప్పడంతో ఆందోళన విరమించారు.

గనులను సుందరీకరించాలి


కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఏరియా అధికారులు

శ్రీరాంపూర్: సింగరేణి గనులు, విభాగాల్లో పరిసరాలను సుందరీకరించాలని కంపెనీ డైరెక్టర్ (ప్రాజెక్ట్, ప్లానింగ్) వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన కొత్తగూడెం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జీఎంలతో మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ ఇన్‌చార్జి జీఎం కే రఘు కుమార్‌కు పలు ఆదేశాలు జారీ చేశారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు సింగరేణి వ్యాప్తంగా అక్టోబర్ 2 నుంచి అక్టోబర్ 31 వరకు స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 3.0 నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా గనులు, డిపార్టుమెంట్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వాటిని అందంగా ముస్తాబు చేసి స్వచ్ఛత ప్రాముఖ్యతను ఉద్యోగులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్ రెడ్డి, గ్రూప్ ఏజెంట్ ఏవి రెడ్డి, డీజీఎం పర్సనల్ అరవిందరావు, డీజీఎం సివిల్ ఆనంద్ కుమార్, ఎన్విరాన్మెంట్ అధికారి హనుమాన్ గౌడ్ పాల్గొన్నారు.

స్వచ్ఛత ఉద్యమం 3.0 నిర్వహణపై కాన్ఫరెన్స్

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలోని అన్ని ఏరియాల అధికారులతో శనివారం సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర రెడ్డి, డైరెక్టర్ (ఆపరేషన్) శ్రీనివాస్ స్వచ్ఛత ఉద్యమం 3.0 నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 2 నుంచి 31వ వరకు అన్ని ఏరియాల్లో స్వచ్ఛత ఉద్యమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. 15రోజులుగా గుర్తించిన ప్రదేశాలు, కార్యాలయాల్లో స్వచ్ఛత ఉద్యమ కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టాలని సూచించారు. ఈ ఉద్యమంలో అధికారులు, ఉద్యోగులు, ఉద్యోగుల కుటుంబాలు పాలు పంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి జీఎం ఎన్. సత్యనారాయణ, డీజీఎం సివిల్ సతీష్‌బాబు, ఎన్విరాన్‌మెంట్ అధికారి హరీష్, ఈఈ సివిల్ మనోజ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

మంత్రి గారూ.. తోళ్ల పరిశ్రమ వైపు చూడరూ..!

మందమర్రిరూరల్: మందమర్రి మండల కేంద్రంలో పద్నాలుగు ఏళ్ల క్రితం తోళ్ల పరిశ్రమ ఏర్పాటుకు అప్పటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు పరిశ్రమ ఏర్పాటుకు నోచుకోలేదు. పరిశ్రమ ఏర్పడితే వందలాది కుటుంబాలకు ఉపాధి లభిస్తుందని ఎదురు చూస్తున్న వారి ఆశలు అడియాశలే అయ్యాయి. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక ఉద్యమ నేతనే ముఖ్యమంత్రి కావడంతో తోళ్ల పరిశ్రమకు నిధులు కేటాయించి ప్రారంభిస్తారని భావించగా నిరాశే మిగిలింది. ఆదివారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వస్తున్న రాష్ట్ర మంత్రి మంత్రి కేటీఆర్ తోళ్ల పరిశ్రమ పక్కనే హెలిప్యాడ్‌లో దిగనున్నారు. ఇక్కడి నుంచి ఆయిల్ ఫాం ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి వెళ్లే దారిలో తోళ్ల పరిశ్రమకు కేటాయించిన స్థలంలో నిర్మించిన షెడ్డు ఉంది. మంత్రి పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని చర్మకారుల సంఘం నాయకులు, గతంలో శిక్షణ తీసుకున్న కుటుంబాలు కోరుతున్నాయి.

నవోదయ ప్రవేశ పరీక్ష రెండో విడత జాబితా విడుదల

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై గల కేంద్రీయ జవహర్ నవోదయ జిల్లా విద్యాలయంలో ఆరవ తరగతిలో ప్రవేశం కోసం గత ఏప్రిల్ 29న నిర్వహించిన ప్రవేశ పరీక్షలో 78 సీట్లకు ఫలితాలు విడుదల కాగా 67 మంది విద్యార్థులు ప్రవేశం తీసుకున్నారని విద్యాలయ ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. మిగిలిన 13 సీట్ల ఖాళీలకు విద్యాలయ సమితి మెరిట్ ఆధారంగా 10మంది విద్యార్థులతో రెండో విడత జాబితాను శనివారం సాయంత్రం విడుదల చేసిందని పేర్కొన్నారు. ఆ పది మందిలో ముగ్గురు విద్యార్థుల బ్లాక్ తేడాలు ఉండటంతో నవోదయ విద్యాలయ సమితి ప్రాంతీయ కార్యాలయానికి పునః పరిశీలనకు పంపినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఎంపికైన విద్యార్థులు ఈ నెల 10వ తేదీ లోగా ప్రవేశాలు తీసుకోవాలని సూచించారు.

పిడుగుపాటుకు రైతు మృతి


దోని సత్తయ్య(ఫైల్)

కౌటాల: కుమురంభీం జిల్లా కౌటాల మండలం ముత్తంపేట గ్రామానికి చెందిన రైతు దోని సత్తయ్య(40) శనివారం సాయంత్రం పిడుగుపాటుకు మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తయ్య ఉదయం గ్రామ శివారులోని తన వరి పొలంలో మందు పిచికారీ చేయడానికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగొస్తుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో నడిచి వెళ్తున్న సత్తయ్యపై పిడుగు పడింది. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య గంగుబాయి, కుమారులు శ్రీకాంత్, శ్రీకర్ ఉన్నారు.